క్లుప్తంగా

తాగునీటి ఎద్దడిని నివారించండి


అధికారులతో మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ: వేసవికాలం దృష్ట్యా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పాత పాల్వంచలో పర్యటించి మిషన్ భగీరథ పైపులైన్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... పైపులైన్లను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నీటి సరఫరా చేయాలన్నారు. పబ్లిక్ హెల్త్ డీఈ వి.శ్రీనివాసరావు, ఏఈ కె.సత్య, ఇంజనీర్లు డి.నవీన్ కుమార్, ఎం.వెంకటేశ్, స్థానికులు వజ్జల రాము, హబీబ్, శ్రీను, సీతారామయ్య, సురేశ్, హాజి, యాదయ్య, బాజీ, చావా లక్ష్మీనారాయణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ


సరుకులు అందజేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

జూలూరుపాడు: మండలంలోని భోజ్యాతండా గ్రామ పంచాయతీ పుల్లుడు తండాకు బాదావత్ శాంతి ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. బాధితురాలు శాంతికి జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... జేపీఆర్ ట్రస్ట్ నిర్వాహకుడు రాజు బాధిత కుటుంబానికి నిత్యావసరాలు వితరణ చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్ మురళి, జేపీఆర్ ట్రస్ట్ సభ్యుడు గణేష్ పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయండి


మాట్లాడుతున్న మోహన్‌నాయక్

జూలూరుపాడు: ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్‌పై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గుగులోత్ మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడు మండలం గురువాగుతండాలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ బద్ధమైన హక్కులను ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదన్నారు. డీఎంహెచ్‌ఓ డిప్యూటేషన్ రద్దు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంత హక్కులను కాలరాస్తున్న డీఎంహెచ్ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్ఓ పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో ఆదివాసీ బిడ్డలకు నష్టం జరిగింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ఏజెన్సీ ఏరియాలో మలేరియా నిర్మూలన నిధులు స్వాహా చేశారని, పారామెడికల్ ఫేక్ సర్టిఫికెట్స్ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సంబంధిత అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గుగులోత్ కేశవ్ నాయక్, లకావత్ నాగేశ్వరరావు, కుమార్, మూడ్ లచ్చు నాయక్, బోడా చంద్రు నాయక్, బన్సీలాల్, మంగీలాల్ నాయక్ పాల్గొన్నారు.

జనంలోకి వనదేవతలు

- సమ్మక్కను గద్దెలపైకి చేర్చిన పూజారులు
- తల్లీకూతుళ్ల రాకతో జాతరకు నిండుదనం
- తరలివచ్చిన భక్తులు.. కిక్కిరిసిన గద్దెల ప్రాంగణాలు


ఇల్లెందురూరల్: డప్పువాయిద్యాలతో సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు, భక్తులు

ఇల్లెందురూరల్: మేడారం జాతరను తలపించే విధంగా మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వనదేవతల జాతరను భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు అంగరంగవైభంగా నిర్వహించారు. బుధవారం సారలమ్మ గద్దెల మీదకు చేరుకోగా గురువారం ఆదివాసీ సంప్రదాయ పద్ధతుల్లో డప్పు వాయిద్యాల నడుమ సమ్మక్క తల్లిని గద్దెల మీదకు చేర్చారు. వనదేవతలైన తల్లీకూతుళ్లు గద్దెల మీదకు చేరుకోవడంతో జాతరకు నిండుదనం సంతరించుకుంది.

భక్తిశ్రద్ధలతో గద్దెల మీదకు సమ్మక్క..
బొజ్జాయిగూడెం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి సమ్మక్కను గద్దెల మీదకు భారీ జనసందోహం నడుమ, ఆదివాసీ పూజారులు భక్తిశ్రద్ధలతో గద్దెల మీదకు చేర్చారు. అంతకు ముందు గద్దెల సమీపంలోని అటవీ ప్రాంతంలో వనదేవతల ప్రధాన పూజారులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో గద్దెల వద్దకు ప్రయనమయ్యారు. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు మూడు కిలోమీటర్ల దూరం పొడవునా భక్తులు బారులు తీరారు.

ఈ సమయంలో పలువురిని అమ్మవారు ఆవహించడంతో సమ్మక్కకు ఎదురేగిన శివసత్తువులను ఆపలేకపోయారు. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ప్రత్యేక రక్షణలో సమ్మక్కను గద్దెల మీదకు చేర్చారు. గద్దెల వద్దకు చేరుకున్న క్రమంలో అమ్మవారిని తాకేందుకు భక్తులు పోటీపడటంతో తొక్కిసలాట జరిగింది.

తల్లికూతుళ్ల దర్శన భాగ్యం..
గద్దెల మీదకు చేరుకున్న వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో గద్దెల వద్దకు చేరుకున్నారు. వనదేవతలను సమ్మరించుకుంటూ పూజలు చేశారు. బంగారం (బెల్లం)తో మొక్కులు సమర్పించుకున్నారు. ఉదయం నుంచి గద్దెల ప్రాంతం కిక్కిరిసి ఉన్నప్పటికీ సాయంత్రం అదే రద్దీతో ఉండటంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రధాన రహదారి పక్కనే జాతర కొనసాగడంతో భక్తుల రద్దీ కారణంగా ట్రాఫిక్ పలుమార్లు నిలిచిపోయింది.

డీఎస్పీ పర్యవేక్షణలో.. జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. డీఎస్పీ నూనావత్ చంద్రభాను స్వయంగా జాతర వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. సీఐ కరుణాకర్‌రెడ్డి వనదేవతల పూజారులతో కలిసి మూడు కిలోమీటర్లు వనంలోకి వెళ్లి సమ్మక్కను గద్దెల వద్దకు చేర్చారు. మార్గమద్యలో రోప్‌పార్టీని అప్రమత్తం చేస్తూ సమ్మక్క యాత్ర సాఫీగా సాగేందుకు సీఐ కృషి ఫలవంతమైంది. ఇక పంచాయతీ కార్యదర్శులు జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్యం, తాగునీటి వసతులను పర్యవేక్షిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా గౌతంపూర్, రామవరం (2 ఇంక్లైన్‌వద్ద), గరీబ్‌పేట ప్రాంతాలలో శ్రీ శ్రీ సమ్మక్క- సారలమ్మ మినీ మేడారం జాతరలో భాగంగా రెండోరోజు గురువారం సాయంత్రం కొమ్ముడప్పులతో, దరువు, చప్పుళ్లతో గిరిజన ఆట పాటలతో కోయ పూజారులచే సమ్మక్కను గద్దెనెక్కించారు. పరిసర ప్రాంతాల కార్మిక కుటుంబీకులు, స్థానిక భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల ప్రాంగణమంతా కోలాహలంగా మారింది.

టేకులపల్లి: ఆదివాసీ వీర వనితలు సమ్మక్క, సారక్క జాతర వేడుకలు గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. టేకులపల్లి, జందాలతండా, కోయగూడెం, బోడు, రామచంద్రునిపేట, ముర్రుట్ల, తదితర గ్రామాల్లో ఆనందోత్సాహాలతో జాతర జరుపుకున్నారు. గురువారం సమ్మక్క, పగిడిద్దరాజులను ఆట పాటలు, మేళతాళాలతో శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా గద్దెల మీదకు తీసుకొచ్చారు. భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


సింగరేణి(కొత్తగూడెం): సమ్మక్క తల్లిని తీసుకొస్తున్న పూజారులు


టేకులపల్లిలో పగిడిద్దరాజుని గద్దె మీదకు తీసుకొస్తున్న పూజారులు


ఇల్లెందురూరల్: బంగారంతో వస్తున్న భక్తులు

భక్తుల కోసం బస్సుల ఎదురుచూపు !


ప్రయాణికుల కోసం వేచిఉన్న ఆర్టీసీ బస్‌లు

ఇల్లెందు: మేడారం భక్తుల కోసం బస్సులు ఎదురు చూస్తున్నాయి. ఇల్లెందు బస్టాండ్ నుంచి 130 బస్‌లు మేడారానికి సిద్ధం చేయగా ప్రతీరోజు 20 బస్‌లు వరకు వెళుతున్నాయి. బస్టాండ్‌లో ఐదారు బస్‌లు క్యూలో సిద్ధంగా ఉంచుతున్నా ప్రయాణికులు రాకపోవటంతో వేచి చూస్తున్నారు. అయితే భక్తులు ఎక్కువగా సొంత వాహనాల్లో వెళుతుండటంతో ఆశించినంత మంది ప్రయాణికులు బస్‌లు ఎక్కడం లేదు. ఈసారి ఇల్లెందు నుంచి గుండాల మీదుగా బస్‌లు నడుపుతున్నారు. మేడారం ప్రయాణం దగ్గర అయినప్పటికీ బస్‌లు మాత్రం నిండటం లేదు. ఆర్టీసీ అధికారులు అత్యధికంగా భక్తులు మేడారం తరలివెళ్తారని బస్‌ల సంఖ్యను పెంచారు. కానీ ప్రయాణికులు మాత్రం బస్‌లను ఆదరించడం లేదు.

కొత్తగూడెంలో బస్సులు కరువు


కొత్తగూడెం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

చుంచుపల్లి: ఆర్టీసీ బస్సులను ఎక్కువ శాతం మేడారం వైపు కేటాయించటంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 60 శాతం బస్సులను అధికారులు మేడారం జాతరకు తిప్పుతున్నారు. దీంతో రెండు రోజులుగా సాధారణ ప్రయాణికులకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో బస్టాండ్లలో ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అంతా మేడారం జాతర్‌పై దృష్టి సారించడంతో ప్రయాణికులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వారి కోసం తగిన సంఖ్యలో బస్సుల కేటాయింపుతో పాటు వచ్చిపోయే బస్సులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. పలు డిపోల పరిధిలో ఉన్న అరకొర బస్సులతోనే వివిధ ప్రాంతాలకు తిప్పుతున్నారు. మేడారం జాతర నేపథ్యంలో వివిధ రూట్‌లకు బస్సుల సంఖ్యను కొంతమేర కుదించిన విషయం తెలిసిందే. దీంతో రోజువారి ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పలు రూట్‌లకు బస్సులు లేకపోవడంతో బస్టాండ్ ప్రాంగణాల్లో ప్రయాణికులకు గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు. చాలా సమయం తర్వాత వచ్చే ఒకటి, రెండు బస్సుల్లో జనం కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు సాధారణ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని బస్సులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నర్సరీ నిర్వహణపై శ్రద్ధ చూపండి


టేకులపల్లి: ఎర్రాయిగూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఇల్లెందురూరల్: ప్రస్తుతం ఎండలు మండుతున్నందున నర్సరీ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ సూచించారు. మండలంలోని పోలారం గ్రామపంచాయతీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నర్సరీని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీటిని అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి ఉప్పుదీప్తి, గుమస్తా జటంగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు నర్సరీల్లో మొక్కలు పెంచే నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. గురువారం కుంటల్ల, బద్దుతండా, పెట్రంచెలక, మొక్కంపాడు, ఎర్రాయిగూడెం, బోడు, కొప్పురాయి, రామచంద్రపేట, బర్లగూడెం గ్రామ పంచాయతీలలో తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్రతి నర్సరీలో షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి లక్ష్మీగణేష్ గాంధీ, అదనపు కార్యక్రమ అధికారి కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు రాములు, మహేందర్, సంజీవ్, పాషా, బాలకృష్ణ, నాగమణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి


రెడ్డిగూడెంలో నిరసన తెలుపుతున్న నాయకులు

పాల్వంచరూరల్: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వీరమల్లు ఉమ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో గురువారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో ఖనౌరీ వద్ద రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించాలని, చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు శాంతియుతంగా పాదయాత్ర చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు, మహిళలపై రబ్బర్ బుల్లెట్లతో కాల్పులు జరపడం సరికాదన్నారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలని, కాల్పులు జరిపిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జక్కుల లింగయ్య, వీరమల్ల మల్లయ్య, లక్ష్మారెడ్డి, ఉపేంద్ర, కలింగరెడ్డి, మణెమ్మ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే పరిశోధనాతత్వం పెరుగుతుంది..



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులలో పరిశోధనాతత్వం సైన్స్ ద్వారానే సాధ్యమవుతుందని, దీనికి టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. గురువారం స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్సాహాన్ని, పరిశీలనా శక్తిని పెంపొందించుకోవడంలో సైన్స్ ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తుందని, పిల్లలందరూ ఇటువంటి టాలెంట్ టెస్ట్‌లలో పాల్గొనడం ద్వారా వారి ప్రతిభకు మెరుగులు దిద్దుకుని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలోని 120 ఉన్నత పాఠశాలల నుంచి హాజరైన 120 మంది విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో హాజరయ్యారు. జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయుల సంయుక్త ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను సింగరేణి పాఠశాల హెచ్ఎం జీఎం ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు పరీక్ష రాసి ప్రతిభను చాటుకున్నారు. తరువాత విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు.

కోతుల బెడదను నివారించండి


యుగపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ కాలనీల్లో కోతుల వల్ల ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం కోతుల బెడదపై తగు చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ కేటీపీఎస్ 7వ దశ అధ్యక్షుడు తేజావత్ రాములు నాయక్ కోరారు. గురువారం స్థానిక సివిల్ ఎస్ఈ యుగపతిని కలిసి వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ... రాధాకృష్ణ టెంపుల్ నుంచి ఇంటర్మీడియట్ కాలనీకి వెళ్లే మధ్యలో రోడ్డు అధ్వానంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఇంటి స్థలాలు ఇవ్వండి

కొత్తగూడెంఅర్బన్: ఇంటి స్థలం పట్టాలు పొందిన వారికి భూమి ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పాతకొత్తగూడెం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన స్థలాన్ని గురువారం మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ భూమిని గుర్తించి గత ప్రభుత్వంలో ఇచ్చినట్లు చెప్పారు.

ఒడ్డుగూడెంలో తాగునీటి బోరు ఏర్పాటు


బోరు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్న గిరిజన ప్రజలకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో బోరు ఏర్పాటు చేయించడంతో ప్రజల దాహార్తి తీరింది. మందేరకలపాడు గ్రామపంచాయతీలోని ఒడ్డుగూడెంలో ఉన్న బోరు రెండేళ్లగా పని చేయకపోవడంతో తాగునీటి కోసం ప్రతీరోజు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజనులు ఇటీవల ఎమ్మెల్యేను కలిసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.2లక్షల నిధులు మంజూరు చేయించగా గురువారం గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. బోరు నిర్మాణ పనులను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బోరు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం ద్వారా గిరిజన ప్రజల తాగునీటి ఇబ్బందులు తొలిగాయని ఎమ్మెల్యే కూనంనేనికి నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్, వైఎస్ గిరి, రమేష్, వినోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీయండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో పట్టాలు పంపిణీ చేసిన 807 మందికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ నినాదంతో గురువారం పాత కొత్తగూడెంలోని స్థలాలను బీఎస్పీ నాయకుడు యేర్రా కామేష్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు వాసం రామకృష్ణ, మైనార్టీ నాయకుడు సాధిక్ పాషా, సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ పరిశీలించారు. మాట్లాడుతూ.. ఇప్పటికే నాలుగున్నర నెలలు గడిచిపోయిందని రెవెన్యూ లెక్కల ప్రకారం ఆరు నెలలు గడిచిపోతే పట్టాలు రద్దయ్యే అవకాశం ఉందని, రద్దయితే డ్రాలో ఎంపికైన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కౌన్సిలర్లు, పాలకవర్గం, రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చిత్తశుద్ధితో ఎందుకు వ్యవహరించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాగుల రవికుమార్, మాలోత్ వీరునాయక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు అమానుషం



ఇల్లెందు: నిరసన తెలుపుతున్న నాయకులు, టేకులపల్లిలో...,


సింగరేణి(కొత్తగూడెం): దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: రైతు పండించిన పంటలు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఢిల్లీలో ఆందోళన చేపట్టిన రైతులపై పోలీసులు కాల్పులు చేయటం తగదని ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, ఎన్డీ రాష్ట్ర నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, సీపీఎం మండల నాయకులు కృష్ణ, చంద్రన్న వర్గం పట్టణ కార్యదర్శి రాంసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఇల్లెందులో అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర వెంకన్న, యాకుబ్‌షావలీ, పాయం వెంకన్న, ధనుంజయ్, ఆలేటి కిరణ్, మోహన్‌రావు, వేముల గురునాథం, మల్లేష్, రంజాన్ పాల్గొన్నారు

టేకులపల్లి: న్యాయమైన హక్కులు, డిమాండ్ల కోసం శాంతియుతంగా పోరాడుతున్న రైతులపై బీజేపీ ప్రభుత్వం లాఠీచార్జ్, కాల్పులు చేయడం అప్రజాస్వామికమం, అమానుషమని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు.

ఈ మేరకు గురువారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను చేతపట్టుకుని బస్టాండ్ సెంటర్ నుంచి ఊరేగింపుగా వెళ్లి టేకులపల్లి సెంటర్‌లో నిరసన తెలియజేసి దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్తి వెంకటేశ్వర్లు, ధర్మపురి వీర బ్రహ్మచారి, గుగులోత్ రాంచందర్, ఈసం నరసింహారావు, జర్పుల సుందర్, బానోతు ఊక్లానాయక్, కదుదుల వీరన్న, రాంచందర్, లింగా తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో రైతాంగంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం దాడులకు నిరసనగా గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కేఎం) నాయకులు దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. రైతాంగం నిరవధికంగా తమ డిమాండ్లపై పోరాడుతోందని అందులో భాగంగా నిరసన తెలుపుతున్న రైతులపై పాశవికంగా కాల్పులు జరిపారని విమర్శించాన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

పాల్వంచ: ఢిల్లీలో రైతులపై కాల్పులు జరపడాన్ని ఖండిస్తూ గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో పాల్వంచ బస్టాండ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిమ్మల రాంబాబు, వై.కల్యాణ్‌కుమార్, కె.కమల, ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పనిలో కొత్తదనం ఉట్టిపడాలి

ఇల్లెందు: ఏ రంగంలో పని చేసినా మానవాళికి ఉపయోగపడే కొత్త దనం ఉట్టిపడే ఆలోచనలు చేయాలని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అన్నారు. గురువారం ఇల్లెందు సింగరేణి స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కౌట్స్ ఉద్యమ నిర్మాత బెడెన్, పావెల్ జన్మదిన వేడుకలు, ప్రపంచ ఆలోచన దినోత్సవం సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని కాపాడేందుకు సరిహద్దుల్లో సైనికులు రేయింబవళ్లు శ్రమిస్తారని, స్కౌట్స్ అండ్ గైడ్స్ సమాజంలోని రుగ్మతలు నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించుకుని బాలభటులు సమాజాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా బాల భటులు ప్రదర్శించిన సాహస ప్రదర్శనలు అకట్టుకున్నాయి. క్యాంపులో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ అందించిన ఎన్‌సీసీ డ్రెస్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, హెచ్ఎంలు టి.వెంకటేశ్వర్లు, సుధాకర్, మేరీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సమాజ హిత కార్యక్రమాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత్ర కీలకమని, విపత్తుల సమయంలో వీరు అందించే విలువలు అద్వితీయమని, యువత స్కౌట్స్ ఉద్యమంలో పాలుపంచుకొని దేశసేవలో ముందుండాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య పిలుపునిచ్చారు.

గురువారం కొత్తగూడెంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో వరల్డ్ థికింగ్ డే సందర్భంగా స్కౌట్స్ వ్యవస్థాపకులు బెడెన్, పావెల్ జయంతిని నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రూపకర్త బెడెన్ విగ్రహానికి పూలమాలలు వేసి స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించారు. జీఎం మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవర్చటానికి ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అడ్వెంచర్ యాక్టివిటీస్... మంకీ క్రోల్, పీడింగ్ బాల్స్, రోప్ కెలెమింగ్స్, టైర్ జంపింగ్‌లలో స్కౌట్స్, గైడ్స్, కబ్స్ బుల్, బుల్స్, రోవర్స్, రేంజర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. .

కొత్తగూడెంఅర్బన్: క్రమశిక్షణాయుత జీవితం కొరకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరాలని చిరాగ్ ఫౌండేషన్ జిల్లా చైర్మెన్ పార్వతీదేవి అన్నారు. గురువారం కొత్తగూడెం బాబూ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్- గైడ్స్ ఉద్యమ స్థాపకులు బెడెన్, పావెల్ జయంతిని నిర్వహించారు. పార్వతీదేవీ మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగం అన్నారు.


ఇల్లెందు: బెడెన్, పావెల్‌కు నివాళులర్పిస్తున్న జీఎం జాన్‌ఆనంద్


సింగరేణి(కొత్తగూడెం): బెడెన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జీఎం బసవయ్య


కొత్తగూడెంఅర్బన్: బాబూ క్యాంపు పాఠశాలలో..